

నత్తనడకన పంచాయతీ భవన నిర్మాణాలు 8లో..

కార్మికుల పక్షాన నిలిచే అభ్యర్థికే మద్దతు 8లో..



వరికి బోనస్ లేనట్టే..!

- చేతులెత్తేసిన రాష్ట్ర ప్రభుత్వం
- వచ్చే వానాకాలం సీజన్ నుంచి అమలు
- ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణ మాఫీ
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటనతో రైతుల్లో ఆశలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

వరి పంటకు ఇస్తామన్న బోనస్ ఈ సీజన్‌కు ఇవ్వలేమని రాష్ట్ర సర్కార్ చేతులెత్తేసింది. వచ్చే వానాకాలం సీజన్ నుంచి అమలుచేస్తామని సీఎం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనతో రైతులు నిరాశకు గురవుతున్నారు. అయితే ఆగస్టు 15వ తేదీ నాటికి 2లక్షల రూపాయల వరకు పంట రుణాలను మాఫీచేస్తామని హామీ ఇవ్వడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీ పథకాలతో పాటు రైతులకు 2 లక్షల రూపాయల వరకు రుణ మాఫీ అమలుచేస్తామని హామీ ఇచ్చారు. ఆ మేరకు రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. డిసెంబరు 7న ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి, పలువురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని సీఎం ప్రకటించారు. కానీ కొన్నింటిని మాత్రమే అమలు చేశారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఆర్టీసీ బస్సుల్లో రాష్ట్రమంతటా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించారు. రూ.500కే వంట గ్యాస్ పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇంకా ఈ పథకం కింద మహిళలకు నెలకు 2,500 రూపాయలు ఇవ్వాల్సి ఉంది. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఇందిరమ్మ పథకం కింద నియోజకవర్గానికి 3 వేల ఇళ్ల కూటాయించారు. యువ వికాసం ఇంకా అమల్లోకి రాలేదు. చేయూత పథకం కింద పెంచిన పింఛన్లు అమలుకు నోచుకోలేదు. ప్రధానంగా రైతు భరోసా పథకం ద్వారా రైతులకు పెట్టుబడి సాయం ఎకరానికి రెండు సీజన్లకు కలిపి 15 వేలు, కౌలు రైతులకు 15 వేలు, రైతు కూలీలకు 12 వేలు. 2 లక్షల రూపాయల వరకు పంట రుణాల మాఫీతో పాటు వరి పంటకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తామని ప్రకటించారు. కానీ ఇప్పటి వరకు బోనస్ ఇవ్వలేదు.

● జారీకాని మార్గదర్శకాలు..

కాంగ్రెస్ గద్దెనెక్కె. సరికి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. అప్పుడు ప్రభుత్వం క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తుందని అంతా భావించారు. కానీ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చేందుకే నానా తంటాలు పడింది. ఆ సీజన్‌లో కాకపోయినా యాసంగి సీజన్‌లో పండించిన ధాన్యానికి బోనస్ ఇస్తుందని అంతా ఆశించినా బోనస్ ప్రకటించలేదు. కనీసం ఎన్నికలు పూర్తయిన తర్వాతనైనా ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని విక్రయించిన రైతులకు బోనస్ ఇస్తుందని రైతులు భావించారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సందర్భంగా ఆయా బహిరంగసభల్లో ఈ సీజన్‌లో వరి పంటకు బోనస్ ఇవ్వలేమని స్పష్టం చేశారు. వానాకాలం సీజన్ నుంచి వరి పంటకు బోనస్ అందజేస్తామని ప్రకటించారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలుచేయడంతో గద్దెనెక్కిన తర్వాత వాటిని అమలు చేసేందుకు బడ్జెట్ లేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 5లక్షల కోట్లకు పైగా అప్పులు కాగా, వాటి వాయిదాల చెల్లింపులకే ప్రభుత్వం అపసోపాలు పడుతున్నది. బడ్జెట్ అంచనాలకు మించి ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలంటే భారీగా బడ్జెట్ కావాల్సి ఉంటుంది. ఆగస్టు 15లోగా 2 లక్షల రూపాయల వరకు రుణ మాఫీ చేస్తామని ప్రకటించినప్పటికీ సాధ్యం అవుతుందా అనే సందేహాలు మొదలయ్యాయి. ఇప్పటివరకు దానిపై ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదు. గడిచిన 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేస్తారా, అంతకు ముందు రైతులు ఆయా బ్యాంకులకు బకాయిపడ్డ రుణాలను కూడా మాఫీ చేస్తారా అనే విషయమై ప్రభుత్వం ఎలాంటి మార్గదర్శకాలు జారీ చేయలేదు. గత ప్రభుత్వం లక్ష రూపాయల వరకు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి చివరలో అమలులోకి తీసుక వచ్చింది. ఎన్నికల షెడ్యూల్ వచ్చేనాటికి కేవలం సగం మంది రైతులకే రుణమాఫీ చేసింది. ప్రస్తుతం గడిచిన ఆర్థిక సంవత్సరంలో తీసుకున్న పంట రుణాలతో పాటు పాత పంట రుణాలను కూడా మాఫీ చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. మొత్తంగా వరి పంటకు బోనస్‌పై పెట్టుకున్న ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లినప్పటికీ, ఆగస్టు 15లోగా రుణ మాఫీ చేస్తామన్న ప్రకటనపై రైతులు ఆశలు పెంచుకున్నారు.

స్ట్రాంగ్ రూములకు ఈవీఎంల తరలింపు

- పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఈవీఎంల తరలింపును పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 20: అసెంబ్లీ సెగ్మెంట్లలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములకు ఈవీఎంలను తరలిస్తున్నామని పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గోదాం నంబర్ 3లోని ఈవీఎం గోదాంను పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ శనివారం అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్‌తో కలిసి పరిశీలించారు. జిల్లా పరిధిలో ఉన్న 3అసెంబ్లీ సెగ్మెంట్ల స్ట్రాంగ్‌రూమ్‌లకు మొదటి ఈవీఎం ర్యాండమైజేషన్‌లో కేటాయించిన ఈవీఎంలను తరలిస్తున్నామని, రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 325 బ్యాలెట్ యూనిట్లు, 325 కంట్రోల్ యూనిట్లు, 364 వీవీప్యాట్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, టీటీఎస్, ఎన్టీపీసీలో స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చడం జరుగుతుందన్నారు. మంథని అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 362 బ్యాలెట్ యూనిట్లు, 362 కంట్రోల్ యూనిట్లు, 406 వీవీప్యాట్లు జేఎన్టీయూ కళాశాలలో, పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్‌కు కేటాయించిన 362 బ్యాలెట్ యూనిట్లు, 362 కంట్రోల్ యూనిట్లు, 406 వీవీప్యాట్లు పెద్దపల్లిలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో భద్రపర్చడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. వెంట తహసీల్దార్ రాజ్‌కుమార్, అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

మూడో రోజు ఆరుగురి నామినేషన్

- 13కు చేరుకున్న నామినేషన్ల సంఖ్య

పెద్దపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల మూడవ రోజైన శనివారం ఆరుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు అందజేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా ఐదుగురు అభ్యర్థులు, ఒకరు కాంగ్రెస్ రెబల్ అభ్యర్థి నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థులుగా గవ్వల శ్రీకాంత్, లింగాల లచ్చయ్య, మేకల అక్షయ్ కుమార్, జాడి ప్రేమ్ సాగర్, మోతె నరేష్ నామినేషన్ దాఖలు చేయగా, కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా కట్కూరి సందీప్ నామినేషన్ వేశారు. దీంతో ఇప్పటి వరకు నామినేషన్లు దాఖలు చేసిన వారి సంఖ్య 13 మందికి చేరుకున్నది. ఈ నెల 21న ఆదివారం కావడంతో ఆ రోజు నామినేషన్లు స్వీకరించరు. ఆ తర్వాత 25వ తేదీ వరకు నామినేషన్లను స్వీకరించనున్నారు. ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు గడ్డం వంశీకృష్ణ, కొప్పుల ఈశ్వర్ నామినేషన్లు వేశారు. బీజేపీ అభ్యర్థి గొమాసె శ్రీనివాస్ ఈనెల 22న నామినేషన్ వేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. గడ్డం వంశీ ఈనెల 24న ర్యాలీగా తరలివచ్చి మరోసారి నామినేషన్ వేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

అకాల వర్షాలతో ఆందోళన చెందుతున్న రైతులు

పెద్దపల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా ఎండలు దంచి కొట్టగా, శనివారం ఉదయం నుంచి ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంది. అక్కడక్కడా అకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం సుల్తానాబాద్ కొద్దిసేపు వర్షం కురిసింది. రెండు రోజుల పాటు తెలంగాణ అంతటా వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖాధికారులు ప్రకటిస్తుండడంతో రైతులు కలవరానికి గురవుతున్నారు. పదిహేను రోజుల నుంచి జిల్లాలో వరి కోతలు ప్రారంభమయ్యాయి. దాదాపు 20 శాతం వరకు వరి కోతలు పూర్తి కాగా, ఇంకా కొనసాగుతున్నాయి. ఈ సీజన్‌లో ఆలస్యంగా వరి నాట్లు వేయడంతో కోతలు కూడా ఆలస్యం అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. జిల్లాలో లక్షా 92వేల ఎకరాల్లో వరి పంటలు సాగుచేశారు. కొంత మంది వర్షాలకు భయపడి పచ్చి వరినే కోస్తుండడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసేందుకు తేమ శాతం రావడం లేదని రైతులు చెబుతున్నారు. వరి కోతలు పూర్తయ్యే వరకు వర్షాలు కురవొద్దని రైతులు దేవుళ్లకు మొక్కుతున్నారు.

వర్షాలకు ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా సహకార శాఖ అధికారి శ్రీమాల



రామునిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీసీవో శ్రీమాల

సుల్తానాబాద్, ఏప్రిల్ 20: అకాల వర్షాలతోపాటు అక్కడక్కడ రాళ్ల వాన కురుస్తున్నందున కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడవకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా సహకార శాఖఅధికారి శ్రీమాల కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. మండలంలోని కనుకుల సొసైటీ పరిధిలోని రామునిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీసీవో సందర్శించారు. కనుకులలో రాళ్లవానకు తడిసిన ధాన్యం గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీవో శ్రీమాల మాట్లాడుతూ వర్షాలుపడే అవకాశం ఉన్నందున అన్ని కేంద్రాల్లో కవర్లను అందుబాటులో ఉంచుకోవాలని ధాన్యం తడవకుండా రైతులకు వాటిని ఇవ్వాలన్నారు. అకాల వర్షాల వలన ధాన్యం తడిసే అవకావం ఉన్నందున కేంద్రాల్లో ఉన్న ధాన్యం కుప్పలను వెంటవెంటనే కాంటా వేసి వాటిని లారీల ద్వారా ఆయా రైస్‌మిల్లులకు పంపించాలని సూచించారు. లారీలను ఎపుడూ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వెంట సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సువర్ణ, కనుకుల సొసైటీ సీఈవో బొంగోని శంకరయ్య, దేవేందర్ ఉన్నారు.

వార్డుల్లో పారిశుధ్యమే ప్రధాన ఎజెండా

- మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమసురేష్‌రెడ్డి



వార్డులో పర్యటిస్తున్న చైర్‌పర్సన్ రమాసురేష్‌రెడ్డి

మంథని, ఏప్రిల్ 20: మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో పారిశుధ్యమే ప్రధాన ఎజెండాగా పనిచేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమాసురేష్‌రెడ్డి వెల్లడించారు. శనివారం మున్సిపల్ పరిధిలోని బోయినిపేటలో పలు వీధులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కాలనీల్లో ఉన్న సమస్యలను ప్రజలు ఆమె దృష్టికి తీసుకవచ్చారు. కాలనీల్లో ఉన్న చెత్తాచెదారాలను మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించారు. మున్సిపల్ పరిధిలోని వార్డుల సందర్శన కార్యక్రమాన్ని త్వరలో చేపడతామని ప్రతివారం ఒక వార్డుగా కేటాయించుకొని ఆయా వార్డులో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

పూసాలలో పోచమ్మ బోనాలు



పోచమ్మకు బోనాలు సమర్పిస్తున్న మహిళలు

సుల్తానాబాద్, ఏప్రిల్ 20: సుల్తానాబాద్ మున్సిపల్ విలీన గ్రామమైన పూసాలలో శనివారం పోచమ్మ తల్లి బోనాల ఉత్సవాలను వైభవంగా జరుపుకున్నారు. గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ, ప్రత్యేక పూజ కార్యక్రమాలను కొనసాగిస్తున్న గ్రామస్తులు శనివారం గ్రామంలోని అన్ని కులాలకు చెందిన వారు పోచమ్మ తల్లి బోనాలను జరుపుకున్నారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని బోనం ఎత్తుకున్నారు. వెంట కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు వేగోళం అబ్బయ్యగౌడ్, సిద్ద తిరుపతి, రాజయ్య, శంకర్ గౌడ్, ఉస్తెం గణేష్ సాయిరి మహేందర్, కల్వల శ్రీను, గాజుల రాజమల్లు, బిరుదు క్రిష్ణ, శ్రీగిరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆస్తి పన్ను రాయితీపై విస్తృత ప్రచారం నిర్వహించాలి

- ఇంకుడు గుంతల ఏర్పాటుపై అవగాహన కల్పించండి - నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్

కోల్‌సిటీ, ఏప్రిల్ 20: రామగుండం కార్పొరేషన్‌లో ఈ ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నుపై 5శాతం రాయితీ పొడగింపు ఈనెల 30 ముగుస్తున్నందున సిబ్బంది విస్తృత ప్రచారాన్ని నిర్వహించాలని రామగుండం నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సిబ్బందికి సూచించారు. శనివారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్తి పన్నుపై 5శాతం రాయితీ కల్పించినట్టు, ఏప్రిల్ 30న గడువు ముగుస్తుందని, ప్రజలకు అవగాహన కల్పించి ఆస్తి పన్నును వసూలు చేయాలని సూచించారు. ప్రజలకు ఇంకుడుగుంతలపై అవగాహన, సిబ్బంది కూడా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని సూచించారు. ప్రజలు సమస్యలపై కార్యాలయానికి ఫిర్యాదు చేయడానికి వస్తే వారితో వినయంగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని, నగరపాలక సంస్థ గౌరవ ప్రతిష్ఠలు పెరిగేలా సిబ్బంది నడుచుకోవాలని కోరారు. ఉద్యోగులు సమయపాలన పాటిస్తూ కార్యాలయ పని వేళల్లో అందుబాటులో ఉండాలని, ఎన్నికల విధులు నిర్వహించడానికి ఏ సమయంలోనైనా సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఈ చిన్నారావు, ఈఈ సుచరణ్, ఏసీపీ శ్రీనివాస్‌రావుతో పాటు ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, ఏప్రిల్ 20 : పెద్దపల్లి జిల్లాలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తి గలవారు ఏప్రిల్ 25 లోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఏ.సురేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో మే 1 నుంచి 31 వరకు 14 సంవత్సరాలలోపు బాల, బాలికలకు వివిధ క్రీడలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. వివరాలకు సెల్ ఫోన్ నెంబర్ 9440167222 నందు సంప్రదించాలని జిల్లా యువజన క్రీడా శాఖ అధికారి ఏ.సురేష్ ఆ ప్రకటనలో తెలిపారు.

సీసీ రోడ్డు పనుల్లో నాణ్యతాలోపం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని పలు గ్రామాల్లో ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపించాయి. సైడ్ బర్మ్ కూడ ఏర్పాటు చేయలేదు. దీంతో సీసీరోడ్డు నిర్మించి రెండు నెలలు కాకముందే పగుళ్లు బారుతున్నాయి. మండలంలోని భోజన్నపేటలో ఇటీవలే వేసిన సీసీ రోడ్డుకు క్యూరింగ్ చేయకపోవడంతో రోడ్డు పూర్తిగా పగుళ్లు బారింది. అధికారులు రోడ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఉద్యమకారులను పట్టించుకోకపోవడంతోనే బీఆర్ఎస్ ఓటమి

- పెద్దపల్లి టికెట్‌పై పునరాలోచించాలి - బీఆర్ఎస్ రెబల్ అభ్యర్థి కొంకటి లింగమూర్తి

గోదావరిఖని, ఏప్రిల్ 20: తెలంగాణ కోసం ఉద్యమించిన ఉద్యమకారులను పట్టించుకోపోవడం వల్లనే బీఆర్ఎస్ ఓటమి చెందిందని మాదిగ ఉపకులాల అధ్యక్షుడు, బీఆర్ఎస్ నాయకులు కొంకటి లింగమూర్తి ఆరోపించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్, కేటీఆర్ కార్యకర్తలను పట్టించుకోకపోవడం వల్లనే బీఆర్ఎస్ ఓటమి చెందిందని, కాంగ్రెస్ వంద రోజుల పాలనలోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఆనాడు తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు ఇప్పుడు ఎక్కడున్నారని, పార్టీ వారిని విస్మరించడం వల్లనే మొన్న జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయిందన్నారు. ఉద్యమాలు చేసిన జైలుకు వెళ్లిన వారిని రూ.5వేల పెన్షన్‌ను ఇస్తే బాగుండేదని, 54లక్షల మందికి పెన్షన్ ఇప్పించిన కేసీఆర్ జైలు జీవితం గడిపిన వారికి ఎందుకు పెన్షన్ ఇవ్వలేదని ఆయన ప్రశ్నించారు. ఎంతోమంది పార్టీ పుట్టినప్పటి నుంచి పనిచేస్తున్నా వారికి పదవులు ఇవ్వలేదని, కొంత మంది నాయకుల వల్లనే కేసీఆర్, కేటీఆర్ ఉద్యమకారులను పట్టించుకోలేదని, ఇప్పటికైనా కేసీఆర్, కేటీఆర్ ఆలోచించాలన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ టికెట్‌పై పునరాలోచించాలని, ఓడిపోయిన వారికి మళ్లీ టికెట్ ఇవ్వడం సరైందన్నారు. తనకు టికెట్ ఇస్తే పెద్దపల్లి పార్లమెంట్ స్థానం నుంచి గెలుస్తానన్నారు.

హాస్టల్ విద్యార్థులను పరామర్శించిన ఎమ్మెల్యే



విద్యార్థులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు



విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

సుల్తానాబాద్, ఏప్రిల్ 20: అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థులను శనివారం ఎమ్మెల్యే విజయరమణారావు పరామర్శించారు. గురుకుల కళాశాలలో దాదాపు 30 మందికి వాంతులు, విరోచనాలు, కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన సంఘటనపై ఎమ్మెల్యే సంబంధిత అధికారులను వాకబుచేశారు. శనివారం ఆయన ఆస్పత్రిలో విద్యార్థులను పరామర్శించి వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని వారికి మెరుగైన చికిత్స అందించాలని డాక్టర్లను ఆదేశించారు. ప్రిన్సిపాల్ సత్యప్రసాద్‌రాజుతో మాట్లాడి విద్యార్థులకు తగిన వసతి సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కాగా, గురుకుల కళాశాలలో జరిగిన సంఘటనను తెలుసుకుని శనివారం బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష హాస్టల్‌ను సందర్శించారు. విద్యార్థులను కలిసి వివరాలు తెలుసుకున్నారు. తరగతి గదులతో పాటు కిచెన్ డైనింగ్ లను పరిశీలించారు. వెంట టౌన్ మైనారిటీ అధ్యక్షుడు ఎండీ రఫిక్, సాయిరామ్, మనోజ్, భూమేష్, అరుణ తదితరులు ఉన్నారు. అలాగే అంబేద్కర్ సంఘం నాయకులు సంకెనపల్లి లక్ష్మన్, వెంకన్న, సీపల్లి అంజయ్య, రాఘవ, తాండ్ర అంజయ్య, సుమన్, సురేష్ తదితరులు హాస్టల్‌ను సందర్శించి పిల్లల ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

● హాస్టల్‌లో మెడికల్ క్యాంప్

హాస్టల్‌లో విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేశామని ఆర్బీఎస్‌కే విభాగం డాక్టర్ అనిత తెలిపారు. పిల్లలందరికీ పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశామన్నారు. దాంతో పాటే రొటీన్‌గా నిర్వహించే పరీక్షలలో భాగంగా కంటి పరీక్షలు కూడా నిర్వహించామన్నారు.

● ఏబీవీపీ ధర్నా

సుల్తానాబాద్ సోషల్ వెల్ఫేర్ కళాశాలలో శుక్రవారం జరిగిన సంఘటనకు పూర్తి నిర్లక్ష్యం ప్రిన్సిపాల్‌దేనని, ఆయనను సస్పెండ్ చేయాలంటూ శనివారం ఏబీవీపీ విద్యార్థులు కళాశాలలో ధర్నా చేశారు. హాస్టల్‌కు వచ్చిన సోషల్ వెల్ఫేర్ రీజనల్ కోఆర్డినేటర్‌ను అడ్డుకున్నారు. ఏబీవీపీ హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ తదితరులు బాధ్యులను సస్పెండ్ చేయాలని, కలెక్టర్ రావాలంటూ బైఠాయించారు. రీజనల్ కోఆర్డినేటర్ మేరీ ఏసుపాదంతో పాటు జిల్లా సంక్షేమ శాఖ అధికారి, ఎస్ఐ, ఇతర అధికారులు అక్కడకు చేరుకుని సంఘటనపై విచారణ జరిపి చర్యలు ఉంటాయని హామీ ఇవ్వడంతో విద్యార్థి నాయకులు ఆందోళన విరమించారు. ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ రాసూరి ప్రవీణ్, విష్ణుభక్తులు రుషి, సిద్దార్థ, వినయ్, అనిల్, వివేక్, పూర్ణచందర్, అభిషేక్, వేణుగోపాల్, శ్రీహర్ష, ప్రీతం, చొప్పరి సిద్ధార్థ తదితరులు ఉన్నారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన జిల్లా క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: మహారాష్ట్రలోని దాదర్‌లో ఆదివారం నుంచి 24వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి మినీ హ్యాండ్‌బాల్ పోటీలకు జిల్లాకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపిక య్యారని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేష్ బాధ్యులు జిట్టవేని శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 14న హ్యాండ్‌బాల్ అసోసియేషన్(హాయ్) నిర్వహించిన మినీ రాష్ట్ర స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ చాటి టి కారుణ్య, బసరవేని చరణ్‌తేజ, జిట్టవేని సుశాంత్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని జిల్లా పెట అధ్యక్ష, కార్యదర్శులు అంతడ్పుల శ్రీనివాస్, యూనుస్‌పాష, హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు కలిగేటి శ్రీనివాస్, అశోక్, రాజ్‌కుమార్, భాస్కర్, రాజేందర్, ఐతరవేని శ్రీనివాస్, అనూప్‌రెడ్డి అభినందించారు.

ఎండల తీవ్రతకు చేపలు మృతి

- రూ. 4లక్షల నష్టం వాటిల్లిందని మత్స్యకారుల ఆవేదన - అధికారులు ఆదుకోవాలని వినతి

ఇల్లందకుంట, ఏప్రిల్ 20: ఎండల తీవ్రతకు మండలంలోని టేకుర్తి గ్రామ ముప్పారం చెరువులో చేపలు మృతి చెందాయి. నాలుగు రోజులుగా దంచి కొడుతున్న ఎండ వేడిమికి సుమారు రెండు టన్నుల చేపలు మృతి చెందాయని మత్స్యకారులు ఆవేదన చెందుతున్నారు. ఈ ఏడాది 2లక్షల పిల్లలు 4లక్షల రూపాయలు పెట్టి కొనుగోలు చేసి చెరువులో వేశారు. చేపలు కూడా 2కేజీల నుంచి 3కేజీల సైజ్ వరకు పెరిగాయని మత్స్యకారులు చెప్పారు. ఏప్రిల్ మొదటి నుంచి ఎండ తీవ్రత పెరిగింది. దీంతో చెరువులో నీరు క్రమంగా తగ్గింది. చెరువు కింద వరి సాగు చేసస్తున్న కొందరు రైతులు రాత్రి వేళ తూము తీయడం వల్ల నీరు బయటకు వెళ్లింది. చెరువులో నీరు పూర్తిస్థాయిలో తగ్గడంతోనే ఎండ తీవ్రతకు చేపలు మృతి చెందాయని, అధికారులు తమను ఆదుకోవాలని మత్స్యకారులు కోరారు.



ముప్పారం చెరువులో మృతి చెందిన చేపలు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



పాక సురేష్(ఫైల్)

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: కరీంనగర్ శివారులోని మానేరు వంతెనపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సిద్ధిపేట జిల్లా తోగుట మండలం గుడికందుల గ్రామానికి చెందిన పాక సురేష్ అలియాస్ సూరజ్ (26) దుర్మరణం చెందాడని ఒకటో రాణా పోలీసులు తెలిపారు. బంధువుల ఇంటికి కరీంనగర్‌కు వచ్చి సురేష్ శుక్రవా రం రాత్రి 10 గంటల సమయంలో సిద్ధిపే టకు వెళుతుండగా మానేరు వంతెనపై తన బైక్ అదుపుతప్పి ఫుట్‌పాత్ రెయిలింగ్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై నుంచి కిందపడిన సురేష్ తలకు తీవ్ర గాయా లతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి సోదరుడు పాక జైబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

గంగాధర, ఏప్రిల్ 20: గంగాధర మండలం మధురానగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళం పగుల గొట్టి 13 తులాల బంగారం, 4లక్షలు ఎత్తుకెళ్లారు. ఎస్సై కిరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వడ్నాల ప్రశాంత్ తన కుటుంబంతో కలిసి శుక్రవారం రాత్రి కొడిమ్యాల మండలంలో శుభకార్యానికి వెళ్లాడు. శనివారం ఉద యం ఇంటికి చేరుకున్నాడు. తలుపు తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోని బీరువాను తెరిచి చూశారు. అందులోని సుమారు 13 తులాల బంగారం, 20 తులాల వెండి, 4లక్షల ఆరువేలు కనిపిం చలేదు. గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి దొంగతనం చేశారని. ప్రశాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్రగాయాలు

రామడుగు, ఏప్రిల్ 20: మండలంలోని గుండి గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని గోపాల్‌రావుపేట్ గ్రామానికి చెందిన జానపద డప్పు కళాకారుడు ఏగోలపు మల్లేశ్ (54). అతడి భార్య భారతమ్మ (42) బైక్‌పై కరీంనగర్ వైపు వెళుతున్నారు. ఆ సమయంలో కరీంనగర్ నుంచి గోపాల్‌రావుపేట్‌కు వెళుతున్న లారీ గుండి గ్రామం వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యా భర్తలకు తీవ్రగాలయ్యాయి. స్థానికులు గమనించి కరీంనగర్‌కు తరలించారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఫెటిలైజర్‌సిటీ కాలనీ, ఏప్రిల్ 20: రామగుండం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధి కాలనీలో నాటుసారా తరలిస్తున్న గుగులోతు కిషన్‌నాయక్ అబ్కారీ సిబ్బందికి పట్టుబడ్డాడు. శనివారం న్యూమారేడుపాక చౌరస్తాలో తనిఖీలు నిర్వహిస్తుండగా అల్లూరు తండా వైపు నుంచి బైక్‌పై నాటుసారా తరలిస్తున్న కిషన్‌నాయక్‌ను ఎక్సైజ్ సిబ్బంది అరెస్ట్ చేశారు. కిషన్‌నాయక్ వద్ద నుంచి నాలుగు లీటర్ల నాటుసారాతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. నాటు సారా అమ్మినా, రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ మంగమ్మ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్స్ ఖాదిర్, ప్రసాద్, శ్రావణ్, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయి స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- 750గ్రాముల గంజాయి పట్టివేత, ఇద్దరి అరెస్టు


నిందితులను అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

కోల్‌సిటీ, ఏప్రిల్ 20: గోదావరిఖని కాకతీయనగర్‌లోని గంజాయి స్థావరంపై శనివారం రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఒక ఇంట్లో తనిఖీ జరిపి 750గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కాకతీయనగర్‌కు చెందిన క్యాటరింగ్ పనిచేసే బీరవేని అభిలాష్(21), హనుమాన్‌నగర్‌కు చెందిన డెలివరీ బాయ్ గండ్రేటి కార్తీక్(21)లను అరెస్టు చేశారు. అనంతరం వారిని గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. తక్కువ కాలంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆలోచనతో గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు.

కుక్కను కాపాడబోయి..
విద్యుదాఘాతంతో వివాహిత మృతి

మెట్‌పల్లి, ఏప్రిల్, 20: కుక్కకు విద్యుత్ వైరు తగిలి కొట్టుకుంటుండగా దానిని కాపాడే ప్రయత్నంలో ఓ వివాహిత విద్యుదాఘాతంతో మృతి చెందింది. మెట్‌పల్లి పట్టణంలోని ఎస్సారెస్పీ కాలువ సమీపంలో ఉంటున్న పల్లపు పద్మ(29)కు భర్త తులసీరాం, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. శనివారం సాయంత్రం పద్మ ఇంటి ముందు కూర్చుని ఉంది. అదే సమయంలో ఇంటి ముందున్న విద్యుత్ వైరు తెగి కుక్కపై పడటంతో విద్యుత్ షాక్‌తో అది కొట్టుకుంటోంది. దీనిని గమనించిన పద్మ వెంటనే అక్కడకు వెళ్లి కాపాడే ప్రయత్నం చేయగా విద్యుత్ తీగ తగిలి షాక్ కొట్టడంతో పద్మ అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి మృతితో చిన్నారుల రోదనలు మిన్నంటాయి.

పేకాట రాయుళ్ల అరెస్టు

● 18 మంది నుంచి రూ.1.51లక్షలు స్వాధీనం

కోరుట్ల రూరల్, ఏప్రిల్ 20: మండలంలోని అయిలాపూర్ అనుబంధ గ్రామమైన కిషన్‌రావుపల్లె శివారులోని ఓ ఫాం హౌస్‌లో పేకాట ఆడుతున్న వారిని కోరుట్ల, మెట్‌పల్లి ఎస్ఐలు కిరణ్‌కుమార్, చిరంజీవి వారి సిబ్బందితో దాడులు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. ఫాం హౌస్‌లో 18 మంది పేకాట ఆడుతున్న వారిని గుర్తించి అరెస్టు చేసినట్లు వారు తెలిపారు. వారి వద్ద రూ.1.51లక్షల నగదుతో పాటు 18 సెల్‌ఫోన్‌లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు. భారీ ఎత్తున పేకాటరాయుళ్ల అరెస్టు కావడంతో మండలంలో చర్చనీయాశంగా మారింది.

● గంభీరావుపేట: మండల కేంద్రంలోని నమాజ్ చెరువు వద్ద పేకాట ఆడుతున్న ఐదుగురు పేకాట రాయుళ్లను పట్టుకున్నట్టు ఎస్ఐ రాంమోహన్ తెలిపారు. పక్కా సమాచారం మేరకు నమాజ్ చెరువు ప్రాంతంలో గాలించగా ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నారని ఎస్ఐ రాంమోహన్ పేర్కొన్నారు. వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. 3 వేల 50 రూపాయలు, ఐదు సెల్‌ఫోన్లు, ఒక బైక్‌ను సీజ్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

విద్యార్థులు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20: విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎవరైనా మానసిక ఆందోళన, ఒత్తిడికి గురైతే వారికి ఫోన్‌లో కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. టెలీమానస్ పేరుతో 14416 నంబరులో సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. మానసిక వైద్యుడి సలహాలు, సూచనలు ఉచితంగా అందచేస్తారని తెలిపారు. మానసిక ఒత్తిడికి గురైన వారిని లక్షణాల ద్వారా గుర్తించి మానసిక వైద్య నిపుణుల దగ్గరికి తీసుకెళ్లాలని సూచించారు. చికాకు పడడం, ఆసక్తి కోల్పోవడం, నిద్రలేమి, అపరాధ భావన, నిరాశావాదం, నిస్సహాయత, ఆత్మహత్య చేసుకోవాలని అనిపించడం, ఒంటరిగా ఉండాలనుకోవడం లాంటి లక్షణాలు కనిపిస్తే మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు భావించాలన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఏప్రిల్ 20: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఈ వేసవిలో నిర్వహించనున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తిగల కోచ్‌లనుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి బి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలలో పది కేంద్రాలలో మే 1నుంచి 31వరకు వివిధ క్రీడాంశాలలో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహించనున్నామని తెలిపారు. జిల్లాలోని ఉత్సాహవంతమైన ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు తమ పూర్తి వివరాలతో ఈ నెల 26 సాయంత్రం 5 గంటలలోగా దరఖాస్తులను జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియం, కరీంనగర్ నందు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు సెల్. 80083 26913 నంబరులో సంప్రదించాలని కోరారు.

ఇసుక తరలిస్తున్న లారీ సీజ్


ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకున్న అధికారులు


ముత్తారం, ఏప్రిల్ 20: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన పులిపాక మహేష్ మానేరు ఇసుకను దొంగతనంగా సీతంపేట గ్రామ శివారులో డంప్ చేసి తరలిస్తుండగా ముత్తారం పోలీసులు పట్టుకున్నారు. అక్రమంగా ఇసుకను డంప్ చేసుకొని అమ్ముకుంటున్నారని సమాచారం మేరకు ముత్తారం పోలీసులు తనిఖీలు చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

గోధూర్‌లో వేంకటేశ్వర స్వామి కల్యాణం

ఇబ్రహీంపట్నం, ఎప్రిల్ 20: మండలంలోని గోధుర్‌లో శనివారం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జువ్వాడి కృష్ణారావు స్వామి వారిని దర్శించున్నారు.

హనుమాన్ జయంతికి ఏర్పాట్లు

● కొండగట్టులో రేపటి నుంచి ఉత్సవాలు ● 23న చిన్న హనుమాన్ జయంతి


కొండగట్టు అంజన్న ఆలయం

మల్యాల, ఏప్రిల్ 20: కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో హన్‌మాన్ జయంత్యుత్సవాలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఏటా కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహించే హన్‌మాన్ జయంత్యుత్సవాలకు తెలంగాణ నుంచే కాకుండా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గడ్ తదితర రాష్ట్రాల నుంచి దాదాపు మూడు లక్షలకు పైగా దీక్షాపరులు, భక్తులు తరలివస్తుంటారు. దీనికిగాను జయంత్యుత్సవాలకు 41 రోజులు ముందు నుంచే 41, 21, 11 రోజుల దీక్షలను భక్తులు చేపట్టి జయంతి సందర్భంగా విరమణ చేయడం ఆనవాయితీ. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులు.. కొందరు మాలధారణ చేస్తుండగా మరికొందరు స్వామి వారిని దర్శించుకుంటూ మాల విరమణ చేస్తున్నారు.

● ప్రతి ఏటా రెండు ఉత్సవాలు

కొండగట్టులో ప్రతి ఏటా రెండు జయంత్యుత్సవాలు జరుగుతుంటాయి. చైత్రపౌర్ణమి రోజున చిన్న హన్‌మాన్ జయంతి, తరువాత 41రోజలకు బహుళశుద్ధ దశమి సందర్భంగా పెద్ద హన్‌మాన్ జయంతి నిర్వహించడం ఆనవాయితీ. ఒక్కో జయంతి మూడు రోజుల పాటు జరుగనుండగా లక్షలాదిగా హన్‌మాన్ దీక్షాపరులు కొండకు వచ్చి మాలవిరమణ చేసి మొక్కులు తీర్చుకుంటారు. ఇందుకు దేవస్థానంలో సోమవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే చిన్నహన్‌మాన్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు కొనసాగుతన్నాయి. మంగళవారం చిన్న హనుమాన్ జయంతి ఘనంగా జరుగనుంది.

● కొనసాగుతున్న ఏర్పాట్లు

చిన్న జయంత్యుత్సవాల ఏర్పాట్ల కోసం కలెక్టర్ యస్మిన్ భాషా, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ దేవస్థానం అధికారులతో పాటు వివిధ శాఖల అధికారులతో సమావేశమై ఆయా విభాగాల ద్వారా ఏర్పాట్లు చేయాలని సూచించారు. కొండపైన చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలైన్‌లు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. కోనేరు ప్రాంతం, ఆలయం వెనుకాల కూడా ఏర్పాటు చేయగా ఉత్సవాలకు సంబంధించిన స్వాగత తోరణాలు పెట్టారు. వాహనాలలో వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేసి వాటి రోడ్లపై తిప్పులూ భక్తులకు ఎల్లవేళలా నీటిని అందుబాటులో ఉంచుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. వీటితో పాటు లక్షలాదిగా వచ్చే భక్తుల కోసం కొండపైన సీసీ కెమెరాలు ఇతరత్రా ఏర్పాటు చేస్తున్నారు. అయితే ఇంకా కొన్ని పనులు కొనసాగుతూనే ఉండగా భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. శనివారం నుంచే పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు ప్రారంభించారు.

● ఆర్జిత సేవలు రద్దు

ఆదివారం నుంచి 24వరకు కొండగట్టు అంజన్న సన్నిధిలో ఆర్జిత సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 22నుంచి 24వరకు జయంతి ఉత్సవాలు జరుగనుండగా ఆర్జిత సేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణ వ్రతాలు తదితర పూజలు ఉండవని భక్తులు సహకరించాలని కోరారు. కాగా జయంతి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ భక్తులకు, దీక్షాపరులకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు.

● మొదలైన భక్తుల సందడి

చిన్న జయంతికి ముందే కొండకు హన్‌మాన్ దీక్షపరుల రాక మొదలైంది. శనివారం వందలాదాగా హనుమాన్ దీక్షాపరులు అంజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి మొక్కులు చెల్లించుకున్నారు. అంజన్న స్వాములతో పాటు భక్తులు కూడా వేలాదిగా తరలివచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించారు.బేతాళుడు, శ్రీరాముల వారిని దర్శించుకున్నారు.


మాల విరమణ కోసం ఏర్పాట్లు


కొండగట్టు ఆలయ పరిసరాల్లో పారిశుధ్య పనులు


సిద్ధమవుతున్న లడ్డూ ప్రసాదాలు

యువకుడి ఆత్మహత్య

● లోన్ యాప్‌లో రుణం తీసుకుని మనస్థాపం


జయవర్ధన్(ఫైల్)

కోల్‌సిటీ, ఏప్రిల్ 20: కుటుంబ సభ్యులకు తెలియకుండా లోన్ యాప్‌లో రుణం తీసుకుని ఆ తరువాత మనస్థాపంతో గోదావరిఖని విద్యానగర్‌కు చెందిన గాలిపెల్లి జయవర్ధన్ (24) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గోదావరిఖని వన్‌టౌన్ పోలీసుల కథనం ప్రకారం.. సింగరేణి కార్మికుడు గాలిపెల్లి తిరుపతికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు. చిన్న కుమారుడు జయవర్ధన్ ఐటీఐ చదివి ఇంటి వద్దనే ఉంటున్నాడు. జయవర్ధన్ తన ఆర్థిక అవసరాల నిమిత్తం తల్లిదండ్రులకు చెప్పకుండా లోన్‌యాప్ ద్వారా రూ.31వేలు అప్పుగా తీసుకున్నాడు. తరువాత తండ్రి తిరుపతికి తెలిపాడు. తాను డబ్బులు చెల్లిస్తానని తిరుపతి కుమారుడితో పేర్కొన్నాడు. శుక్రవారం రాత్రి 8.30గంటలకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో వంట గదిలో రేకుల షెడ్డుకు చీరతో ఉరి వేసుకున్నాడు. తల్లి గమనించి ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. జయవర్ధన్ తండ్రి తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ప్రధానోపాధ్యాయుడి సస్పెన్షన్

● విధులపై నిర్లక్ష్యం, నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపణలు

తిమ్మాపూర్, ఏప్రిల్ 20: తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు(జీహెచ్‌ఎం, గ్రేడ్-2) పి రాజాభాను చంద్రప్రకాష్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్(వరంగల్) కె సత్యనారాయణరెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజాభాను చంద్రప్రకాష్ ఎల్ఎండీ స్కూల్ కాంప్లెక్స్ కింద కొంత మంది ఉపాధ్యాయుల సెలవు జీతాలు చెల్లింపులకు సంబంధించి 10,07,165 రూపాయలు ట్రెజరీకి జమచేయలేదని, డీడీవోగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారని, నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఇచ్చిన నివేదిక అధారంగా సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. కొందరు ఉపాధ్యాయులు తమకు రావాల్సిన నిధుల విషయంలో నష్టం జరిగిందని, న్యాయం చేయాలని జిల్లా విద్యాశాధికారికి, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాగా ప్రధానోపాధ్యాయుడు కూడా తనకు ఆ నిధులకు సంబంధం లేదని, దానికి పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్ తిరుమల, ఆమె భర్త రాజ్‌కుమార్ తప్పుడు పత్రాలు సృష్టించి డబ్బులు కాజేసినట్లు ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌తో పాటు, జిల్లా విద్యాధికారి, జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా విద్యాధికారి డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య నేతృత్వంలో ఈ నెల 5న ముగ్గురితో కూడిన కమిటీని నియమించి విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీనిపై విచారించిన కమిటీ జిల్లా విద్యాధికారికి నివేదిక సమర్పించింది. ఈ మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. సస్పెండ్ అయిన రాజాభాను చంద్రప్రకాష్ తెలంగాణ గెజిటెడ్ హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కావడం గమనార్హం.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు : డీఐఈవో

కరీంనగర్ టౌన్, ఏప్రిల్ 20: బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలను కళాశాలలు కచ్చితంగా పాటించాలని, నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక డీఐఈవో కార్యాలయంలో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలతో ఆయన ప్రత్యేకంగా సమావేశమై బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ నిబంధనలపై చర్చించారు. ఫలితాలు, ప్రవేశాలకు సంబంధించిన ప్రచారాలను చేసుకునే ముందు విధిగా అనుమతి తీసుకోవాలని సూచించారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసే వరకు ముందస్తు అడ్మిషన్లను తీసుకోవద్దన్నారు. వేసవి సెలవులను మే 31వ తేదీ వరకు ప్రభుత్వం ప్రకటించినందున ఎట్టి పరిస్థితిలో కళాశాలల్లో తరగతులను నిర్వహించవద్దన్నారు. క్వాలిఫై లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలని సూచిస్తూ ఇతర నిబంధనలపై కళాశాలల యాజమాన్యాలతో చర్చించారు. సమావేశంలో బాఐఈవో కార్యాలయ పరిపాలనాధికారి సుధాకర్, ప్రైవేట్ కళాశాలల తరుపున మహిపాల్‌రెడ్డి (ఎస్సీజేసీ), మునీందర్ (సాన్వి), అంజిరెడ్డి (రెసొనెన్స్), నాగార్జున్‌రెడ్డి (ఎస్ఆర్), జగన్మోహన్‌రెడ్డి (శ్రీచైతన్య) పాల్గొన్నారు.

భవనం పైనుంచి పడి బాలుడి మృతి

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: కరీంనగర్ విద్యానగర్‌లో నిర్మాణంలో ఉన్న భవనం రెండవ అంతస్తు పైనుంచి కిందపడి ఛత్తీస్‌గడ్ రాష్ట్రం చంప జిల్లా జంజిగిరికి చెందిన 18 నెలలు వయస్సున్న రాఖీ కుర్రే తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రెండో టాణా పోలీసులు తెలిపారు. విద్యానగర్‌లో భవన నిర్మాణంలో మేస్త్రిగా పనిచేస్తున్న రవికాంత్ శనివారం ఉదయం తన కొడుకుని వెంటతీసుకుని భవనం నిర్మాణం పనులకు వెళ్లాడు. కొడుకును రెండో అంతస్తులో పడుకోబెట్టి అక్కడే పనులు చేస్తున్నాడు. మధ్యాహ్నం భోజన సమయంలో కొడుకు కోసం తండ్రి వెదకగా కనిపించలేదు. కిందకు వెళ్లిచూడగా తీవ్రగాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. బాలుడు ఆడుకుంటూ ప్రమాదవశాత్తు భవనం పైనుంచి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

రూ.88.49 లక్షల నగదు పట్టివేత


సీజ్ చేసిన నగదును చూపుతున్న ఏసీపీ నరేందర్

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 20: కరీంనగర్‌లో శనివారం పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో వేర్వేరు చోట్ల నలుగరు వ్యక్తుల వద్ద రూ. 88 లక్షల 49 వేల నగదు పట్టుబడింది. రాజీవ్ చౌక్‌లో నిర్వహిచిన తనిఖీల్లో అశోక్‌నగర్‌కు చెందిన ఉప్పుల రాఘవాచారి, హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన సూరజ్ రమేష్‌ల వద్ద 71 లక్షల నగదు పట్టుబడింది. ఒక జ్యువెల్లరీ షాపునకు చెందిన నగదును వీరిద్దరూ బైక్‌పై బ్యాగ్‌లలో తీసుకువెళుతూ పోలీసులకు పట్టుబడ్డారు. నగరంలోని ఐబీ చౌరస్తాలో నిర్వహించిన తనిఖీల్లో అశోక్‌నగర్‌కు చెందిన అంకిత్ తివారి వద్ద 2లక్షల 60 వేల నగదు, ఇందిరాచౌక్ వద్ద తనిఖీలలో సుభాష్‌నగర్‌కు చెందిన దామెర అరుణ్‌కుమార్ వద్ద 14 లక్షల 89 వేల నగదు పట్టుబడింది. ఈ డబ్బులు ఒక ఎలక్ట్రానిక్ షోరూంకు చెందినవిగా సమాచారం. మొత్తం 88 లక్షల 49 వేల రూపాయలు సీజ్ చేశామని కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్ తెలిపారు. 10 లక్షలపైగా పట్టుబడిన నగదును ఆదాయపు పన్నుశాఖ అధికారులకు, 10లక్షలలోపు నగదును జిల్లా మానిటరింగ్ కమిటీకి స్వాధీనం చేశామని ఏసీపీ తెలిపారు. సంబంధిత నగదుకు సంబంధించిన రశీదులు, ఇతర ఆధారాలు చూపించిన తరువాత నగదును రిలీజ్ చేస్తారని తెలిపారు.

సుల్తానాబాద్‌లో భారీ వర్షం

- తడిసిన ధాన్యం
- కుప్పలను కాపాడుకోవడానికి రైతుల ఇబ్బందులు



సుల్తానాబాద్ శాసితినగర్ కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యం కుప్పలు, ధాన్యం కుప్పలపై కవర్లు కప్పుతున్న రైతులు


కనుకులలోధాన్యంపై వడగళ్లు

సుల్తానాబాద్, ఏప్రిల్ 20: సుల్తానాబాద్ ప్రాంతంలో శనివారం అరగంట సేపు భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు గ్రామాల్లో రైతుల పంటపొలాలు దెబ్బతినడమే కాకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిలువ ఉన్న కుప్పలు తడిసిపోయాయి. ఉదయం పది గంటల తర్వాత నుంచి ఎండ ఉన్నా ఒక్కసారిగా వర్షం పడ డంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. సుల్తానాబాద్‌పట్టణంలోని మార్కెట్ యార్డులో, శాస్త్రినగర్, కాట్నపల్లి, నర్సయ్యపల్లిలోని కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. ఆయా గ్రామాల్లో కోతలకు సిద్ధంగా ఉన్న పొలాలు కూడా కొంత మేర దెబ్బతిన్నాయి. గొలుసులతో కూడిన వరి నేలకు రాలింది. అయితే అకాల వర్షం రావడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తమ కుప్పలను కాపాడుకోవడానికి కవర్లను కప్పుకున్నారు. సుల్తానాబాద్, కాట్నపల్లి, నర్సయ్యపల్లి, గర్రెపల్లి, భూపతిపూర్ తదితర గ్రామాల్లో మాత్రమే వర్షం పడింది. అంతకుముందు కనుకుల గ్రామంలో వడగళ్ల వాన పడడంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. కుప్పలు ఆరబోసి ఉంచగా ఒక్కసారిగా వడగళ్ల వాన పడడంతో ధాన్యం దెబ్బతింది. అకాల వర్షంతో రైతులు ధాన్యం తడిసి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడానికి మిల్లర్లు కేంద్రాల నిర్వాహకలు ఎలాంటి కొర్రీలు పెడతారోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్లేశం

సుభాష్‌నగర్, ఏప్రిల్ 20: తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుర్రాల మల్లేశంను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బండ ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు గురుకుల విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్ మహాలక్ష్మి

గన్నేరువరం, ఏప్రిల్ 20: మండలంలోని గుండ్లపల్లి మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల విద్యార్థిని టి.కారుణ్య జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మహాలక్ష్మి తెలిపారు. తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 14న మహబూబ్‌నగర్‌లో రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అండర్-12 విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 21నుంచి 24వరకు మహారాష్ట్రలోని దాదర్‌లో జరిగే 17వ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొననున్నటు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మహాలక్ష్మి, పీఈటి జ్యోతి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు హన్మండ్ల భాస్కర్, ఆర్‌సీఓ గౌతంరెడ్డి విద్యార్థిని అభినందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని మాజీ సర్పంచ్‌ల నిరసన


నిరసన తెలుపుతున్న మాజీ సర్పంచులు

ఇల్లంతకుంట, ఏప్రిల్ 20: అప్పులు చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టామని, వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని తాజా మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. మండల పరిషత్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చల్ల నారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పిన పనులు చేయడానికి సర్పంచులు అప్పులు చేశారన్నారు. ఇప్పుడు అప్పు ఇచ్చిన వారు అడుగుతుండడంతో గ్రామాల్లో తిరగలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం సర్పంచులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. గతంలో ఇచ్చిన చెక్కులు సైతం తిరిగి వచ్చాయన్నారు. కేటీఆర్ ప్రాతినిధ్యం వహించిన మండలాల్లో పరిస్థితి కొంత మెరుగ్గా ఉందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేనిపక్షంలో లోక్‌సభ ఎన్నిక లలో పోటీ చేసి నిరసన తెలుపుతామని అన్నారు. మాజీ సర్పంచులు గట్టు మల్లారెడ్డి, బిల్లవేని పర్శరాం, కట్ట వెంకటరెడ్డి, ముస్కు మల్లయ్య, కూనబోయిన భాగ్యలక్ష్మి, కేతిరెడ్డి అనసూయ, మంద సుశీల, మేఘలవ్వ, మల్లవ్వ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో శ్రీనివాసమూర్తి వైఖరిపై మాజీ సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలు విన్నవించడానికి వెళ్లగా ఎంపీడీవో నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారన్నారు. ప్రజల కోసమే తాము పనిచేశామని, స్వలాభం కోసం చేయలేదని అన్నారు.

తాలుతప్ప పేరుతో రైతులను మోసగించవద్దు

పాలకుర్తి, ఏప్రిల్ 20: ఆరుకాలం కష్టపడి పంటలు పండించిన రైతులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తాలు తప్ప పేరుతో మోసం చేస్తే చర్యలు తీసుకుంటామని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ అన్నారు. శనివారం ఆయన పాలకుర్తి మండలం పరిధిలోని పలు గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వ మద్దతు ధరకు వరిధాన్యం కొనుగోలు చేయాలని, రైతులను ఇబ్బందులకు గురిచేస్తే సహించేది లేదన్నారు.

కాగా, కుక్కలగూడుర్ తదితర గ్రామాల్లో తన సతీమణి మనాలి ఠాకూర్‌తో కలిసి జాతీయ ఉపాధిహామీ కూలీలను కలిసి వారి పనితీరును పరిశీలించారు.

సుల్తానాబాద్‌లో బీజేపీ ఇంటింటి ప్రచారం

సుల్తానాబాద్, ఏప్రిల్ 20: సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శాస్త్రినగర్‌లో శనివారం బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బూత్ కమిటీ అధ్యక్షుడు భూసారపు సంపత్ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు నాయకులు కలసి పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్‌ను కు ఓటు వేసి గెలిపించాలని దేశ ప్రధానిగా మరోసారి మోదీకి పట్టం కట్టాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కూకట్ల నాగరాజు, ప్రధాన కార్యదర్శి గబజీంకార్ పవన్, గుడ్ల వెంకటేశ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి బుర్ర సతీస్ గౌడ్, ఉపాధ్యక్షులు పల్లె తిరుపతి, రమేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

'ఓటే ప్రశ్నించే గొంతుక కావాలి'

సుల్తానాబాద్, ఏప్రిల్ 20: ఓటే ప్రశ్నించే గొంతుక కావాలని హమ్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ పటేల్ అన్నారు. సుల్తానాబాద్ శ్రీవాణి డిగ్రీ కళాశాలలో శనివారం ఓటు హక్కు వినియోగం గురించి యువతకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. నా ఓటే నా ఆయుధం అనే నినాదంతో ముద్రించిన వాల్‌పోస్టర్లను ఈ సందర్భంగా శ్రీవాణి డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ బండారి కమ లాకర్ ఆవిష్కరించారు. ఓటు మనకు వజ్రాయుధం లాంటిదని, దాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కమలాకర్, సాగర్ పిలుపునిచ్చారు. మే నెల 13 నాటి పోలింగ్‌లో యువత నిజాయితీగల నేతను ఎన్నుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యాక్షుడు వేణుగోపాల్ శర్మ, జిల్లా రమణ, అధ్యాపకులు బండారి సౌజన్య, జంగ సంతోష్, సురేష్, రమేష్ రజిత తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో హనుమత్ సేవ

సుల్తానాబాద్, ఏప్రిల్ 20: సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల మానేటి రంగనాయక స్వామి వారి బ్రహ్మోత్సవాలలో శనివారం హన్‌మత్ సేవను నిర్వహించారు. నాలుగో రోజు ఉత్సవాలలో భాగంగా హనుమత్ వాహనంపై గోదాదేవి సహిత రంగనాయకుల స్వామి వారు ఆలయ మాఢ వీధులలో ఊరేగారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు.

అక్రమంగా ఇసుక రవాణా

ధర్మారం,ఏప్రిల్ 20: ధర్మారం మండలంలో అక్రమంగా ఇసుక రవాణా సాగుతోంది. ప్రతి రోజు ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. రాత్రి సమయంలో అడ్డు అదుపు లేకుండా ట్రాక్టర్ల ద్వారా ఇసుకను రవాణా చేస్తున్నారు. పట్టపగలు కూడా రాష్ట్ర రహదారుల గుండా ట్రాక్టర్లతో ఇసుకను రవాణా చేస్తున్నారు. ఇసుక ట్రాక్టర్ల డ్రైవర్లు అతివేగంగా ట్రాక్టర్లను నడుపుతున్నారు. కానీ అధికారులు పట్టించుకోవడం లేదు. అధికారులకు కనిపించకుండా ఎస్సారెస్పీ కాలువల వెంట ఇసుక ట్రాక్టర్లను ఆయా గ్రామాలకు రవాణా చేస్తున్నారు. కొంత మంది వ్యాపారులు ఇసుకను అధిక రేటుకు అమ్ముతు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు ఎలాగు పట్టించుకోరనే నమ్మకంతొ దర్జాగా ఇసుకను రవాణాను సాగిస్తున్నారు. ఇప్పటికైన సంబందిత అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

'కొప్పుల' జన్మదిన వేడుకలు

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 20: మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్ లోక్‌సభ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ జన్మదిన సందర్భంగా పెద్దపల్లి స్ఫూర్తి మానసిక వికలాంగుల ఆశ్రమంలో కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈశ్వర్ అభిమాని పేరు మండ్ల రవళి, ఎండి ఖాదర్, మొగిలి తిరుపతి, దర్శుల రవి, గడ్డం శ్యామ్, జునేది ఖాన్, శ్రీధర్ పటేల్, పోలవేణి నరేష్, అవుల జయరాజు, సంతోష్, కొంకటి తిరుపతి, శుభాకాంక్షలు తెలియజేశారు.

నత్తనడకన పంచాయతీ భవన నిర్మాణాలు

- 11 గ్రామపంచాయతీలకు కొత్త భవనాలు మంజూరు - అసంపూర్తిగా కొన్ని.. ప్రారంభం కానివి మరికొన్ని..



దేవునిపల్లిలో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనం



కుర్మపల్లి నిర్మిస్తున్న గ్రామపంచాయతీ భవనం

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 20 : పెద్దపల్లి మండలంలోని 11 గ్రామపంచాయతీలకు కొత్త భవనాలు మంజూరయ్యాయి. వాటి నిర్మాణం కోసం ఈజీఎస్ నిధుల మంజూరయ్యియి. అయితే కాంట్రాక్టర్లకు బిల్లులు వెంటవెంటనే అందకపోవడంతో నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక గ్రామాల్లో ప్రజల సౌకర్యార్థం పాలన అందించాలని ఉద్దేశంతో కొన్ని అనుబంధ గ్రామాలను ప్రత్యేక గ్రామ పంచాయతీలకు ఏర్పాటు చేసింది. కానీ వాటికి పక్కా భవనాలు లేకపోవడంతో పాఠశాల గదులు, అంగన్‌వాడీ భవనాలు, అద్దె ఇళ్లలో కొనసాగుతుండడంతో పాటు శిథిలావస్థలో ఉన్న పాత భవనాల్లోనే పాలన కొనసాగిస్తున్నారు. మండలంలోని 11 గ్రామపంచాయతీలకు నూతన భవనాలు నిర్మించాలని ఒక్కో భవనానికి ఈజీఎస్ ద్వారా రూ.20లక్షలు మంజూరుచేయగా, కేవలం 7గ్రామాల్లో పనులు ప్రారంభం అయ్యాయి. మిగతా నాలుగు గ్రామాల్లో ఇప్పటికి పనులు ప్రారంభంలేదు. బ్రాహ్మణపల్లి, కాపులపల్లి గ్రామాల్లో నిర్మాణాలు పూర్తయిన బిల్లుల చెల్లింపులో ఆలస్యం అవుతుండటంతో గుత్తేదారులు పనులను నిలిపివేశారు. గోపయ్యపల్లి, కాపులపల్లి, కుర్మపల్లి, బ్రాహ్మణపల్లి, పెద్దకల్వల, అప్పన్నపేట, దేవునిపల్లి గ్రామాల్లో నిర్మాణ పనులు ప్రారంభించగా పనులు సాగుతున్నాయి. రాంపల్లి, నిమ్మనపల్లి, కాసులపల్లి, గౌరెడ్డిపేట గ్రామాల్లో ఇంకా పనులు ప్రారంభం కాలేదు. బ్రాహ్మణపల్లి, కాపులపల్లి నూతన గ్రామపంచాయతీ భవనాలు 80శాతం మేర పూర్తికాగా, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు కార్యాలయాలను ప్రారంభించారు. గోపయ్యపల్లి, కుర్మపల్లి, పెద్దకల్వల, అప్పన్నపేట, దేవునిపల్లి గ్రామాల్లో పనులు సాగుతున్నాయి.

అద్దె భవనాల్లో కొన్ని.. పాఠశాలల్లో మరికొన్ని..

మండలంలోని రాంపల్లి, దేవునిపల్లి గ్రామపంచాయతీలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. బ్రాహ్మణపల్లి, పెద్దకల్వల, బ్రాహ్మణపల్లి, అప్పన్నపేట, కాసులపల్లి, గౌరెడ్డిపేట గ్రామపంచాయతీల భవనాలు శిథిలావస్థకు చేరుకోగా, కొత్తగా భవనాలను నిర్మిస్తున్నారు. నిమ్మనపల్లి, గోపయ్యపల్లి, కుర్మపల్లి గ్రామపంచాయతీలు పాఠశాల భవనాల్లో కొనసాగుతున్నాయి. కాగా, కాపులపల్లి, బ్రాహ్మణపల్లి, పెద్దకల్వల, కుర్మపల్లి, దేవునిపల్లి గ్రామాల్లో నిర్మాణాలు చేపడుతున్నారు. పనులు అయిన వరకు కాంట్రాక్టర్‌లకు బిల్లులు రాకపోవడంతో నిరాశతో ఉన్నారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా బిల్లులు మాత్రం రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. అప్పులు తీసుకొచ్చి నిర్మాణాలకు పెట్టామని, బిల్లుల చెల్లింపులో ఆలస్యం అవుతుండటంతో వడ్డీలు పెరుగుతున్నాయని వాపోతున్నారు.

త్వరగా నిర్మాణాలు పూర్తి చేస్తాం..

- గున్నాల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీవో

పెద్దపల్లి మండలంలోని నిర్మాణాలు జరుగుతున్న నూతన గ్రామపంచాయతీల పనులు త్వరగా పూర్త య్యేందుకు చర్యలు తీసుకుంటాం. నిర్మాణం చివరి దశ లో ఉన్న భవనాలను పూర్తిస్థాయిలో చేపడుతాం. ఎన్నికల కోడ్ ముందు ప్రారంభించిన భవనాలు పూర్తిచేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందిస్తాం.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

- జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత

మంథనిరూరల్, ఏప్రిల్ 20: వేసవిలో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశలత అన్నారు. శనివారం మంథని మండలం సూరయ్యపల్లి గ్రామంలోని పలు వార్డుల్లో ఆమె ఆకస్మిక తనిఖీ చేసి పరిసర ప్రాంతాలను సందర్శించి పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుధ్యం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలోని డంపింగ్ యార్డు శ్మశానవాటిక పారిశుద్ధ్య పనులు తనిఖీ చేసి వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె వెంట ఎంపీవో ఆరిఫ్, పంచాయతీ కార్యదర్శి డి మౌనిక, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



సూరయ్యపల్లి గ్రామంలో పర్యటిస్తున్న డీపీవో

ఉపాధిహామీ పథకంపై సామాజిక తనిఖీ

రామగిరి, ఏప్రిల్ 20: మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీని శనివారం నిర్వహించారు. ఎంపీడీవో శైలజా అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డిఆర్‌డివో పీడి రవీందర్ హాజరయ్యారు. మండలంలో మూడవ రౌండ్‌లో ఏప్రిల్ 2023-మార్చి 31 2024లో జరిగిన పనుల పై ఆడిట్ నిర్వహించారు. మండల వ్యాప్తంగా 279 పనులకు లేబర్, మేటిరియల్ మొత్తం 2,16,04620 తనిఖీ నిర్వహించారు. అందులో లద్నాపూర్ గ్రామంలో జరిగిన పనుల్లో రూ. 1000 రికవరి చేసినట్లు అధికారులు వెల్లడించారు. తనిఖీలో విజిలెన్స్ అధికారులు కొంరయ్య, లక్ష్మన్, అంబుడ్స్‌మెన్ తిమ్మరాజు శరత్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

మంత్రి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిక

మంథని, ఏప్రిల్ 20: స్థానిక శ్రీపాదకాలనీకి చెందిన బీఆర్ఎస్ పార్టీ నేత మడివెల్లి రమేష్ శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి శ్రీధర్‌బాబు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు మూల పురుషోత్తంరెడ్డి, గుండా పాపారావులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షుల నియామకం

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 20: కాంగ్రెస్ పార్టీ రామగుండం కార్పొరేషన్ 50 డివిజన్ల అధ్యక్షులను శనివారం నగర అధ్యక్షులు బొంతల రాజేష్ ప్రకటించారు. 1వ డివిజన్ అధ్యక్షుడిగా శంకర్, 2వ డివిజన్ అధ్యక్షుడిగా మడిపెల్లి మల్లేష్, 3వ డివిజన్‌కు కిషన్‌రెడ్డి, 4వ డివిజన్‌కు భరత్‌గౌడ్, అబ్బాస్, 5వ డివిజన్‌కు లక్ష్మయ్య, ఈదునూరి రవి, 6వ డివిజన్‌కు గడ్డం శ్రీనివాస్, 7వ డివిజన్‌కు నాజీమ్, 8వ డివిజన్ సత్యప్రసాద్, 9వ డివిజన్‌కు జనగామ శివ, 10వ డివిజన్‌కు మారంగుల రమేష్, 11వ డివిజన్‌కు గుడికందుల రవి, 12వ డివిజన్‌కు కుంట నది, 13వ డివిజన్‌కు కనుకుంట్ల రాము, 14వ డివిజన్‌కు బూర్ల శ్రీను, కొక్కిరాల శ్రీనివాస్, 15వ డివిజన్‌కు సాగర కుమార్, 16వ డివిజన్‌కు దాసరి రాజిరెడ్డి, 17వ డివిజన్‌కు కిషన్‌నాయక్, 18వ డివిజన్‌కు మార్క రాజేందర్, 19వ డివిజన్‌కు తిరుపతిరెడ్డి, 20వ డివిజన్‌కు సిరిశెట్టి సతీష్, 21వ డివిజన్‌కు మొయిన్, 22వ డివిజన్‌కు బుతుల్, 23వ డివిజన్‌కు సదానందం, 24డివిజన్‌కు కొలని కవితారెడ్డి, 25వ డివిజన్‌కు సాగి సంతోష్ రావులను నియమించారు. 26వ డివిజన్ అధ్యక్షులుగా గుంపుల తిరుపతి, 27వ డివిజన్‌కు కల్వల రంజిత్, 28వ డివిజన్‌కు మహేష్‌గౌడ్, 29వ డివిజన్‌కు హరీష్, 30వ డివిజన్‌కు పంజాల ఆంజనేయులు, 31వ డివిజన్‌కు మిట్ట తిరుపతి, 32వ డివిజన్‌కు మెంటం ఉదయ్‌రాజ్, 33వ డివిజన్‌కు బండి రాము, 34వ డివిజన్‌కు ఎర్ర మధు, 35వ డివిజన్‌కు గాజుల కిరణ్, 36వ డివిజన్‌కు వంశీ కృష్ణ37వ డివిజన్‌కు బిల్ల కొమురయ్య, 38వ డివిజన్‌కు ఒర్సు అనీల్, 39వ డివిజన్‌కు మేకల వెంకటేష్, బీ ఆసీఫ్, 40వ డివిజన్‌కు దూళికట్ట సతీష్, 41వ డివిజన్‌కు ఫజల్ బేగ్, 42వ డివిజన్‌కు ఆడెపు దశరథం, 43వ డివిజన్‌కు సొల్లు రామస్వామి, 44వ డివిజన్‌కు సిరిపురం మహేష్, 45వ డివిజన్‌కు ఎర్రగొల్ల శ్రీనివాస్, 46వ డివిజన్‌కు లింగాల హరికృష్ణ, 47వ డివిజన్‌కు మేకల హరికృష్ణ, 48వ డివిజన్‌కు జక్కుల రాజేందర్, 49వ డివిజన్‌కు రియాజుద్దీన్, 50వ డివిజన్ అధ్యక్షులుగా గుర్రం గోపిగౌడ్‌లను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అనుమతితో నియమించినట్టు పేర్కొన్నారు.



క్రీడలతో మానసికోల్లాసం : ఆర్జీ-1 జీఎం శ్రీనివాస్



క్రికెట్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాస్

కళ్యాణ్‌నగర్, ఏప్రిల్ 20: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ అన్నారు. గోదావరిఖని జీఎం కాలనీ క్రీడా మైదానంలో శనివారం హెచ్‌సీఏ ఆధ్వర్యంలో గోదావరి బ్లూస్‌క్రికెట్ అసోసియేషన్ ఏర్పాటుచేసిన నెల రోజుల వేసవి క్రికెట్ కోచింగ్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరకంగా, మానసికంగా, ఉల్లాసాన్ని పెంపొందించడంతో పాటు జ్ఞానం పెరుగుతుందన్నారు. వేసవిలో పిల్లలు సెల్‌ఫోన్లకు లీనం కాకుండా ఇలాంటి సమ్మర్ క్రికెట్, వేసవి క్రీడా శిక్షణా శిబిరాలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం(పర్సనల్) లక్ష్మీనారాయణ, ఎస్‌ఓటూ జీఎం రాంమోహన్, నిర్వాహకులు కిరణ్‌కుమార్, సురేష్ పాల్గొన్నారు.

నేడు ఖనిలో ఐఎన్‌టీయూసీ మహాసభ

- హాజరుకానున్న కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు, మంత్రులు

గోదావరిఖని, ఏప్రిల్ 20: సింగరేణి కోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) 41వ రాష్ట్ర మహాసభను ఆదివారం గోదావరిఖనిలో జరుగనున్నది. సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఆరు డివిజన్లలో ప్రాతినిధ్య సంఘంగా విజయం సాధించిన ఐఎన్‌టీయూసీ విజయోత్సవంతో ఈ మహాసభను జరుపుకుంటున్నది. సింగరేణిలోని 11డివిజన్ల నుంచి ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు ఈ మహాసభకు హాజరుకానున్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు జీ సంజీవరెడ్డితో పాటు మంత్రి శ్రీధర్‌బాబు, కోల్‌బెల్ట్ ప్రాంత కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఈ మహాసభలో పాల్గొనే అవకాశం ఉన్నది. ప్రధాన కార్యదర్శి జనక్ ప్రసాద్ ఆధ్వర్యంలో మహాసభల ఏర్పాటు జరుగుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఐఎన్‌టీయూసీ ఏర్పాటు చేసిన మహాసభలకు రాజకీయ ప్రాముఖ్యత కూడా సంతరించుకున్నది. ఈ మహాసభల్లో ఐఎన్‌టీయూసీ పలు తీర్మానాలను ప్రవేశపెట్టనున్నది. సింగరేణి కార్మికుల సమస్యలపై లేబర్ యూనియన్ డిమాండ్ డ్రాఫ్ట తయారు చేసింది. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కార్యవర్గాన్ని నూతనంగా ఎన్నుకునే అవకాశం ఉంటుంది.

కార్మికుల పక్షాన నిలిచే అభ్యర్థికే మద్దతు

- టీబీజీకేఎస్ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ రాజిరెడ్డి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 20: పార్లమెంట్ ఎన్నికల్లో సింగరేణి కార్మికుల పక్షాన నిలిచే అభ్యర్థికే టీబీజీకేఎస్ మద్దతు ఇస్తుందని సెంట్రల్ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటీ రద్దు, పెర్క్స్ మీద ఐటీ రీయంబర్స్, గనుల వేలానికి వ్యతిరేకంగా నిలిచే అభ్యర్థికి మద్దతు ఇవ్వనున్నట్టు తెలిపారు. గెలిచిన రెండు సంఘాలు గుర్తింపు పత్రం కోసం ఆరాటపడుతున్నాయో తప్ప కార్మికుల సమస్యలను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రెండుసార్లు గెలిచిన టీబీజీకేఎస్ కారుణ్య నియామకాల పేరిట 13వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని, 16 శాతం నుంచి 31 శాతం లాభాల వాటా ఇప్పించామని, కోల్‌ఇండియాలో లేని అనేక హక్కులు సాధించినట్లు రాజిరెడ్డి తెలిపారు. 2017 ఎన్నికల తర్వాత రెండేళ్ల కాలపరిమితి ఉండాలని డిమాండ్ చేసిన సంఘాలు నేడు నాలుగేళ్ళు ఉండా లని కోరడం శోచనీయమని అన్నారు. ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఉన్న 2011-12 సంవత్సరంలో కోల్ ఇండియాలక్ష పెర్క్స్ మీద ఐటీ రీయంబర్స్ చేసిన ఇక్కడ అమలుచేయించలేకపోయారని అన్నారు. ప్రస్తుతం సింగరేణి గుర్తింపు పత్రం ఇస్తామన్నా రెండు సంఘాలు తీసుకోవడానికి ముందుకు రావడం లేదని, తద్వారా అనేక కార్మిక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని రాజారెడ్డి పేర్కొన్నారు. ఎండల తీవ్రత ఉన్నా పని వేళలు మార్చడం, క్వారీలో రెస్ట్‌షెల్టర్లు వంటి ప్రత్యామ్నాయ చర్యలు లేవని, కార్మిక వాడలకు రెండు రోజులకు ఒకసారి శుభ్రతలేని నీరు సరఫరా అవుతున్నా గెలిచిన సంఘాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. బొగ్గు గనుల వేలంలో సింగరేణి పాల్గొనేలా రెండు సంఘాలు కుట్ర చేస్తున్నాయని, అపార అనుభవం ఉన్న సింగరేణికి రాష్ట్ర పరిధిలో ఉన్న బొగ్గు బ్లాక్‌లను కేటాయించాలని కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన బాధ్యత గెలిచిన సంఘాలతో పాటు రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నదని రాజిరెడ్డి అన్నారు. ఈనెల 24 బుధవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని, ముఖ్య కార్యకర్తలు హాజరుకావాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో మాదాసు రామ్మూర్తి, సంపత్‌కుమార్, అయిలి శ్రీనివాస్, నాగెల్లి సాంబయ్య, బేతి చంద్రయ్య, మల్లేశ్వరరావు, మామిడి తిరుపతి, వెంకటి, మార్కు నరేష్, శశాంక్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 20:సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులపై ఇవ్వనున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి ప్రభావిత, పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశా లు కల్పించేలా 38వృత్తివిద్యా కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు జీఎం తెలిపారు. కాస్మోటిక్(యువతులకు), డ్రోన్‌టెక్నీషియన్, సోలార్ టెక్నీషియన్, సెల్‌టెక్నీషియన్, ఆర్క్‌అండ్ గ్యాస్‌వెల్డింగ్, టూవీలర్ మెకానిక్, కంప్యూటర్ డీటీపీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌వంటి 38 కోర్సులకు ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. కాస్మోటిక్ కోర్సుకు విద్యార్హత అవసరం లేదని, ఇతర కోర్సులకు డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ, పదో తరగతి, పాసై ఉండాలని తెలిపారు.

ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



మాట్లాడుతున్న మక్కాన్‌సింగ్

యైటింక్లయిన్‌కాలనీ, ఏప్రిల్ 20: సింగరేణి ఉద్యోగుల సంక్షేమానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉన్నదని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ అన్నారు. శనివారం ఓసీపీ-3 కృషిభవన్‌లో ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి సింగరేణి ప్రైవేట్ పరం చేసే కుట్ర చేశాయని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన అనతికాలంలోనే ప్రమాద బీమా కోటి వర్తింపజేశామని, రామగుండం మెడికల్ కాలేజీకి సింగరేణి వైద్య కళాశాలగా నామకరణం చేస్తామని, కార్మికులకు ఇళ్ళ పట్టాలు, ఐటీ రుద్దకు కాంగ్రెస్ కృషి చేస్తుందని పేర్కొన్నారు. యువత ఉపాధి కోసం స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుచేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్ని కల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీని గెలిపించాలని, యువకుడైన వంశీ గెలిపిస్తే పార్లమెంట్‌లో సింగరేణి కార్మికుల సమస్యలను లేవనెత్తి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తాడని మక్కాన్‌సింగ్ పేర్కొన్నారు. ఈగేట్‌మీటింగ్‌లో ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్, నర్సింహారెడ్డి, సత్యనారాయణరెడ్డి, మహంకాళిస్వామి, బొంతల రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, గుండేటి రాజేష్, శంకర్‌నాయక్, సాగంటి శంకర్ పాల్గొన్నారు.

సెగ్రిగేషన్ షెడ్లను వినియోగించుకోవాలి

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 20: గ్రామాల్లో ఏర్పాటు చేసిన సెగ్రిగేషన్ షెడ్లను వినియోగించాలని ఎంపీవో సుదర్శన్ సూచించారు. శనివారం మండలంలోని రాంపల్లి గ్రామంలో సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించి తడి, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు ప్లాస్టిక్, సీసం వస్తువులను వేరు చేయాలని సూచించారు. అలాగే వర్మి కంపోస్టు ఎరువు తయారీకి చర్యలు తీసుకోవాలని పంచాయతీ సెక్రెటరీకి సూచించారు. మొక్కలు ఎండిపోకుండా నీరు అందించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి శంకరయ్య, కారోబార్ వంశీ ఉన్నారు.

కార్మికుల పిల్లలకు అవగాహన సదస్సు

పెద్దపల్లి రూరల్, ఏప్రిల్ 20: తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖ, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రొడక్టివిటీ కౌన్సిల్ ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ తెలంగాణ భవన నిర్మాణ కార్మిక శాఖలో నమోదు అయిన కార్మికుల పిల్లలకు ఉచిత కెరీర్ గైడెన్స్‌పై శనివారం అవగాహన కల్పించారు. జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో కార్మికుల పిల్లలకు ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈసందర్భంగా ఎపిపిసి ప్రాజెక్ట్ లీడ్ దాసరి రాజేంద్ర, ఎపిపిసి ప్రాజెక్టు ఇన్‌చార్జి డి.ప్రకాష్ హాజరై మాట్లాడారు. అనంతరం 245మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొమురయ్య

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 20: రాష్ట్ర సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడిగా పడాల కొమురయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శిగా బొంగొని సదయ్యగౌడ్‌లను రాష్ట్ర అధ్యక్షులు కోడూరి పరుశురాంగౌడ్ నియమించారు. శనివారం సంఘం సమావేశం పెద్దపల్లి నందన గార్డెన్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా నియామక పత్రాలు అందజేశారు. నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులను పూలమాలలు, శాలువాలతో సంఘం నాయకులు, సభ్యులు ఘనంగా సత్కరించారు. అనంతరం పడాల కొమురయ్య గౌడ్ మాట్లాడుతూ త్వరలో అనుబంధ సంఘాల ఎన్నిక పూర్తి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఫౌండర్ సభ్యులు సింగం సత్తయ్య గౌడ్, గోపగాని సారయ్య గౌడ్, ముత్యం శంకర్ గౌడ్, తాళ్లపల్లి లింగయ్య గౌడ్, బాలసాని వెంకటేశం గౌడ్, గంగాధరి రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

ఎలిగేడు, ఏప్రిల్ 20: ప్రజా సమస్యలపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని జిల్లా పరిషత్ సీఈవో నరేందర్ అన్నారు. శనివారం మండలంలోని పలు ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్య, ఉపాధిహామీ పనుల పురోగతిపై ఆరా తీశారు. ఆయనతో పాటు ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, పీఆర్ఏఈ జగదీశ్వర్, ఆర్‌డబ్ల్యూ ఏఈ యశశ్రీ, సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఏపీవో సదానందంలు పాల్గొన్నారు.

'ఓటు హక్కు వజ్రాయుధం లాంటిది'



ఓదెలలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఓదెల, ఏప్రిల్ 20: ఓటు హక్కు వజ్రాయుధం లాంటిదని తహసీల్దార్ యాకయ్య అన్నారు. శనివారం ఓదెలలో స్వీప్ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా యాకయ్య మాట్లాడుతూ నిజాయితీగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. అంతకుముందు రెవెన్యూ కార్యాలయం నుంచి గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి, వైద్యాధికారి సహబాజ్ ఖాన్, ఆర్ఐలు రాజేందర్, నర్సింగం, అలాగే రామ్మూర్తి, కిరణ్, మౌనిక, రజిత, కృష్ణ, బాపు,రాజం, హైదర్, బీఎల్‌వోలు, వైద్య, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

'పెద్దపల్లిలో బీజేపీ గెలుపు ఖాయం'

కాల్వశ్రీరాంపూర్, ఏప్రిల్ 20: పెద్దపల్లి ఎంపీగా బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గెలుపు ఖాయమని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కోఆర్డినేటర్ తాత రవియాదవ్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ప్రచారంలో భాగంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను కరపత్రం ద్వారా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు చిలువేరు సంపత్ కుమార్, తోటశ్రీధర్, పోగులశీను, పూరెల్లదిలీప్, దాసరి కృష్ణ, పిల్లలమరి రాములు, గరిడే కిషన్, చిర్లంచ తిరుపతి, తాతరాజు గోపగోని రమేష్, భైరి రామ్మూర్తి, ఒద్ది లక్ష్మణ్, దాసరి ఆకాశ్, నామని రవి పాల్గొన్నారు.

నేడు ఓపెన్ డిగ్రీపై అవగాహన

కోల్‌సిటీటౌన్, ఏప్రిల్ 20: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థుల పరిచయ కార్యక్రమం ఆదివారం గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్టు అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ జి.సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు విద్యార్థులకు తరగతులు, పరీక్షలు, ప్రాక్టికల్స్ నిర్వహణ విధివిధానాల గురించి వివరిస్తారన్నారు. విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

అంబేద్కర్ సంఘానికి రాజీనామా

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 20: తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం, తెలంగాణ ప్రజా సంఘాల జేఏసీకి రాజీనామా చేస్తున్నట్లు బొంకూరి సురేందర్ సన్నీ తెలిపారు. శనివారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలో సన్నీ మాట్లాడుతూ ఇప్పటికే రాజీనామా లేఖను ప్రజా సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ గజ్జెల కాంతంకు పంపించి ఆమోదించాలని కోరినట్లు తెలిపారు. 2001 నుంచి దళితుల సమస్యలపై ఉద్యమించానని, తెలంగాణ ఉద్యమంలోనూ జేఏసీలో కీలకపాత్ర పోషించినట్లు వివరించారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా నిర్ణయం తీసుకున్నానని, ఇన్నాళ్లు తనకు సహకరించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. మాదిగలు చట్టసభల్లోకి రాకుండా కుట్ర జరుగుతోందని, ఇక నుంచి మాదిగ జాతి యువతను చైతన్య పరిచి రాజ్యాధికారం కోసం మాదిగ శక్తి ద్వారానే కార్యక్రమాలను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

'ఆపరేషన్ గరుడ'కు విరాళం



ఏసీపీకి చెక్కు అందజేస్తున్న యూనియన్ బ్యాంక్ మేనేజర్

పెద్దపల్లిటౌన్, ఏప్రిల్ 20: రామగుండం సీపీ చేపట్టిన ఆపరేషన్ గరుడకు యూనియన్ బ్యాంక్ పెద్దపల్లి మేనేజర్ లక్ష రూపాయల చెక్కును ఏసీపీ గజ్జి కృష్ణకు అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ డ్రోన్ కెమరాల ద్వారా అసాంఘిక కార్యకలాపాలు అరికట్టవచ్చన్నారు. ఇవి పట్టణంలో సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యవేక్షిస్తుంటాయన్నారు. ఈ కార్యక్రమం తొలుత పెద్దపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రారంభించినట్లు తెలిపారు. దీనిని త్వరలో కమిషనరేట్ పరిధిలో విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ గరుడకు సహకరించేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐలు కృష్ణ, సత్యనారాయణ, ఎస్సైలు లక్ష్మణ్‌రావు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

యువతి వివాహానికి ఆర్థిక సహాయం

కమాన్‌పూర్, ఏప్రిల్ 20 : మండల కేంద్రంలోని ఇస్లాంనగర్‌కు చెందిన పేద యువతి సానియా వివాహానికి సీనియర్ జర్నలిస్టు జబ్బార్‌ఖాన్ 24 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో షౌకత్‌ఖాన్, లల్లుబాబా, సయ్యద్ నజీబ్, అఫ్జల్, దావుద్, అస్గర్ సలీం, మోయిన్ తదితరులు ఉన్నారు.